'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## ఖతార్ కేసు సుఖాంతం

**ఖతార్ జైలు** నుంచి ఎనిమిది మంది భారత నావికాదళ మాజీ అధికారులు విడుదల కావడం భారతదేశానికి దౌత్యపరంగా లభించిన ఘన విజయంగా చెప్పాలి. వారు మృత్యువు అంచులదాకా వెళ్లిన సంగతి తెలిసిందే. గూఢచర్యం కేసులో పట్టుబడ్డ ఆ ఎనిమిది మందికి ఖతార్ కోర్టు మరణశిక్ష విధించింది. 2022 ఆగస్టు 30న ఆ దేశ రాజధాని దోహా నగరంలో ఖతార్ గూఢచార సంస్థ వారిని అరెస్టు చేసింది. అరెస్టు అయినవారిలో కమాండర్ సుగుణాకర్ పాకాల విశాఖపట్నానికి చెందిన తెలుగువాడు. గుట్టుచప్పుడు కాకుండా అరెస్టు చేసిన తీరు, రహస్యంగా విచారణ జరిపిన కారణంగా గూఢచర్యం కేసు అనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. దీనిపై భారత్‌లో తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారం భారత్‌కు దౌత్యపరంగా పెద్ద సవాలుగా మారింది.

అధికారికంగా ఆరోపణలు వెల్లడించనప్పటికీ ఇజ్రాయెల్‌కు వారు రక్షణ రహస్యాలు చేరవేశారని మీడియాలో రకరకాల కథనాలు వచ్చాయి. ఖతార్‌తో సహా పశ్చిమాసియాలోని ఏ ముస్లిం దేశానికైనా ఇజ్రాయెల్ బద్ధ శత్రువు. ఖతార్‌లో రక్షణ సంబంధ సంస్థలో కన్సల్టెంట్లుగా పనిచేస్తున్న ఆ ఎనిమిది మందిని అధికారులు హడావుడిగా అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఎనిమిదిసార్లు బెయిల్ దరఖాస్తులు న్యాయస్థానాల తిరస్కారానికి గురయ్యాయి. కేసు వివరాలు ఏవీ బయటకు రాలేదు. విచారణ పూర్తిగా తెరవెనుకే జరిగింది. గతేడాది మార్చిలో విచారణ ప్రారంభం కాగా.. అక్టోబర్‌లో నిందితులందరికీ మరణశిక్ష విధించినట్టు పిడుగుపాటు లాంటి వార్త వెలువడింది. నిందితులు భారత నౌకాదళంలో ఉన్నత పదవులు నిర్వహించిన వ్యక్తులు. వారికి కోర్టు విధించిన శిక్ష అమలైతే ఆవేదన కలగడంతో పాటుగా అంతర్జాతీయంగా తలవంపులు కలుగుతాయి. దీంతో వారిని విడిపించేందుకు భారత విదేశాంగ శాఖ దౌత్యపరంగా, న్యాయపరంగా చర్యలు చేపట్టింది.

గత డిసెంబర్‌లో దుబాయ్‌లో జరిగిన కాప్- 28 వాతావరణ మార్పుల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఖతార్ అమీర్ అల్ థానీతో ప్రధాని నరేంద్ర మోదీ విడిగా సమావేశమయ్యారు. అధికారిక సమాచారం లేనప్పటికీ నేవీ అధికారుల కేసుపై వారు చర్చించి ఉంటారని మీడియా కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అదే నెల మరణశిక్షలను కారాగారవాస శిక్షలుగా మార్చినట్టు సమాచారం వెలువడింది. తాజాగా వారి శిక్షలు రద్దు చేసి విడుదల చేశారన్న వార్త ఎంతో ఊరట కలిగించింది. భారత విదేశాంగ శాఖ కూడా నిందితులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి సమాచారం వెల్లడించకపోవడం కొసమెరుపు. ఈ కేసు భారత్-ఖతార్ ద్వైపాక్షిక సంబంధాల్లో మైలురాయిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అంతర్జాతీయంగా, ముఖ్యంగా పశ్చిమాసియాలో భారత్‌కు పెరుగుతున్న పలుకుబడికి ఈ కేసు అద్దం పడుతున్నది.

## ఒక్క సీటే ఇస్తాం!



ఢిల్లీలో కాంగ్రెస్ కంటే మా పార్టీయే బలంగా ఉంది. ఢిల్లీ అసెంబ్లీలో ఆ పార్టీకి ప్రాతినిధ్యమే లేదు. హస్తం పార్టీకి చెందిన ఒక్క ఎంపీ ఇక్కడ గెలవలేదు. బలాబలాలను బేరీజు వేసుకుంటే ఢిల్లీలో పోటీ చేసే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు. ఒక్క సీటు కూడా ఆ పార్టీకి దక్కదు. కానీ, మేం 'ఇండియా' కూటమి ధర్మానికి కట్టుబడి ఒక్క సీటు ఆఫర్ చేస్తున్నాం.

**- సందీప్ పాఠక్,** ఆప్ ఎంపీ



## అర్హులకు అందని పీఎం కిసాన్

పీఎం కిసాన్ పథకం పేరిట కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఏటా మూడు విడతల్లో కలిపి ఒక్కో రైతు కుటుంబానికి రూ.6 వేల చొప్పున సాయం అందుతున్నది. 2019 ఫిబ్రవరిలో ఈ పథకం ప్రారంభమైంది. అయితే దీనిలో అనేక లోపాలు ఉన్నాయి.

2019 ఫిబ్రవరిలోపు పట్టాదారు పాసు పుస్తకం ఉన్నవారికే ఈ పథక లబ్ధి చేకూరుతున్నది. పథకం ప్రారంభమయ్యే నాటికి పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నవారే అర్హులనే నిబంధన వల్ల అనేకమంది రైతులు నష్టపోతున్నారు. ఆ తేదీ తర్వాత పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు దీనికి అనర్హులవుతున్నారు.

మన రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది రైతులకు మాత్రమే ఈ నిధులు అందుతున్నాయి. దేశవ్యాప్తంగా ఈ సంఖ్య 10 కోట్ల వరకు ఉండవచ్చు. అయితే నిబంధనల్లో పేర్కొన్న తేదీ తర్వాత ఒక్క మన రాష్ట్రంలోనే సుమారు 20 లక్షల మంది రైతులు కొత్తగా పాస్ పుస్తకాలు పొందారు. దేశవ్యాప్తంగా ఈ సంఖ్య కోట్లలో ఉంటుంది. అర్హులైనప్పటికీ ఈ రైతుల నుంచి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించడం లేదు. ఈ కారణంగా దేశవ్యాప్తంగా కోట్ల మంది రైతులు నష్టపోతున్నారు. రైతులకు శరాఘాతంగా మారిన ఈ నిబంధనను తొలగించాలి. అర్హులందరికీ పీఎం కిసాన్ సాయం అందజేయాలి. పెట్టుబడి వ్యయాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఇస్తున్న సాయం మొత్తాన్ని కూడా పెంచాలి. రైతులను ఆదుకోవాలి.

**- రావుల రామ్మోహన్‌రెడ్డి**

# అబద్ధాలు, అర్ధ సత్యాలు



**వి.ప్రకాశ్**

ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణను మరోసారి ఆగం చేయడానికి, ప్రజలను మరోసారి తప్పుదారి పట్టించడానికి సమైక్య రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ పాలకులు సిద్ధమయ్యారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అవగాహనారాహిత్యంతో అసెంబ్లీలో మాట్లాడుతున్నారని తెలంగాణ సాగునీటి రంగంపై ఏమాత్రం అవగాహన ఉన్నవారికైనా సులభంగానే అర్థమవుతుంది.

శాసనసభలో సాగునీటి రంగంపై తన అవగాహనారాహిత్యాన్ని సమర్థించుకోవడానికి, ప్రజలను మరింత గందరగోళ పర్చడానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసెంబ్లీలో మాట్లాడిన ఒక క్లిప్ (తనకు అవసరమైన ముక్కలు)లోని చిన్న భాగాన్ని శాసనసభ్యులకు మంత్రి ఉత్తమ్ చూపించారు. ఆయన వ్యాఖ్యల్లోని అసత్యాలు, అబద్ధాలు ఈ విధంగా ఉన్నాయి.



సమైక్య రాష్ట్రంలో కన్నా ఎక్కువ అన్యాయం బీఆర్‌ఎస్ పాలనలో జరిగిందని పదేపదే ఉత్తమ్ పేర్కొంటున్నారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన అన్యాయాలు మరోసారి ఈ తరానికి తెలపాల్సి ఉంది. ఆంధ్రా - తెలంగాణ (అప్పటి హైదరాబాద్) రాష్ట్రంలో 'విశాలాంధ్ర' నినాదాన్ని తెరపైకి తీసుకొచ్చింది అప్పటి కాంగ్రెస్ నాయకులే. ఈ సమైక్య నినాదం 'తెలుగు భాష' ముసుగులో సాగిన అసలు కారణాల్లో మొదటిది కృష్ణా, గోదావరి జలాలను తెలంగాణకు దక్కనివ్వకుండా ఆంధ్రకు మళ్లించాలనేది సుస్పష్టం. చరిత్రే దీనికి సాక్ష్యం.

ఆనాడు ఏడో నిజాం వద్ద ఉండే ప్రముఖ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ సహకారంతో తెలంగాణలో కరువు బారినపడుతున్న నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కేవలం నాలుగు ప్రాజెక్టుల ద్వారా (ఎగువ కృష్ణా 54 టీఎంసీలు, భీమా 100.50 టీఎంసీలు, తుంగభద్రాలో లెవెల్ కెనాల్ 19.50 టీఎంసీలు, ఏలేశ్వరం ప్రాజెక్ట్ 161 టీఎంసీలు) మొత్తం 335 టీఎంసీలను వినియోగించాలని ప్రణాళికలను సిద్ధం చేశారు. పైన పేర్కొన్న ప్రాజెక్టులకు 1951 జూలై 27, 28 తేదీల్లో కేంద్ర ప్రణాళికా సంఘం కృష్ణా జలాలను కూడా కేటాయించింది. ఈ ప్రాజెక్టులు పూర్తయి తెలంగాణలోని కృష్ణా బేసిన్‌లో 335 టీఎంసీల నీళ్లు పారితే (తెలంగాణలోని కృష్ణా బేసిన్‌లో ఉన్న మధ్యతరహా, చిన్నతరహా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు కాకుండానే) కోస్తాంధ్ర, రాయలసీమలోని కృష్ణా బేసిన్‌కు వెలుపలి ప్రాంతాలకు నీళ్లు దక్కవనే కారణంగానే అప్పటి కాంగ్రెస్ పాలకులు తెలంగాణను ఆంధ్రతో కలపాలని విశాలాంధ్ర నినాదం, ఉద్యమాన్ని తీసుకొచ్చారు. రాష్ట్రాల పునర్విభజన కమిషన్ ముందు తెలంగాణవాదులు ఇదే భయాన్ని, సందేహాలను, అనుమానాలను స్పష్టంగానే తెలిపారని జస్టిస్ ఫజల్ అలీ తన రిపోర్టులో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత ఆనాటి తెలంగాణవాదుల భయాలే నిజమయ్యాయి. రాయలసీమవాసి, అప్పటి ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి సమైక్య రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి కాగానే పాలమూరుకు నీళ్లు ఇచ్చేందుకు ప్రతిపాదించిన మూడు ప్రాజెక్టులను (174 టీఎంసీలు) గాలికొదిలేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమ ప్రారంభం దాకా సుమారు మూడున్నర దశాబ్దాలకు పైగా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు వదిలేశారో కనీసం ప్రశ్నించిన పాపానపోలేదు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు. ఈ పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ పాలకులదే.

**నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో సుమారు 7 లక్షల ఎకరాలకుపైగా సాగునీరందాల్సిన ఏలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని దిగువన గల నందికొండ వద్దకు మార్చింది కాంగ్రెస్ పాలకులే. దీని వల్ల 161 టీఎంసీలకు బదులు కనీసం 70-80 టీఎంసీలు కూడా నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా ఐదారేండ్లకోసారి పారడం లేదు. ఈ కుట్రల వల్ల పాలమూరు- నల్లగొండ జిల్లాలకు చెందిన సుమారు 19-20 లక్షల మంది నాలుగు దశాబ్దాలకు పైగా వలసపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పాపానికి కారణం కూడా కాంగ్రెస్ పాలకులే.**

'మా నీళ్లు మాకు కావాలి' అని ప్రారంభమైన మలిదశ తెలంగాణ ఉద్యమానికి సారథ్యం వహించిన తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షులు కేసీఆర్ సమైక్య రాష్ట్రంలో కొనసాగుతున్న సాగునీటి వివక్షకు వ్యతిరేకంగా 40 రోజులకు పైగా జలసాధన ఉద్యమాన్ని నిర్వహించారు. ఇరవై ఏండ్ల కిందటే తెలంగాణ సాగునీటి కష్టాలు తొలగించడానికి ఒక అద్భుతమైన విజన్‌ను రూపొందించారు. అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో మరోసారి తెలంగాణకు నష్టం చేయడానికి, ఈ ప్రాంత ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నించారు. నీళ్లు రావని తెలిసి ఎస్సారెస్పీ రెండో దశ కాల్వలు తవ్వారు. ప్రాజెక్టు నిర్మించడం సాధ్యపడదని తెలిసి, తుమ్మిడిహట్టి వద్ద పర్యావరణ అనుమతులు రావని తెలిసి, అంతర్రాష్ట్ర సమస్యలున్నాయని తెలిసి కూడా చేవెళ్ల వద్ద కాల్వలు తవ్వారు. కేంద్ర జలసంఘం అనుమతులు లేకుండానే పోతిరెడ్డిపాడు ద్వారా రోజుకు ఐదు టీఎంసీల నీటిని మళ్లించారు.

**శ్రీశైలం ప్రాజెక్టు జల విద్యుత్తు కోసమే తప్ప సాగునీటికి కాదని, బచావత్ తీర్పును కాలరాసి చుక్క నీరు కూడా నాగార్జునసాగర్‌కు రానివ్వకుండా రాయలసీమకు మళ్లించుకుపోవాలని కుట్రలు చేసింది ఈ కాంగ్రెస్ నాయకులు కాదా? కేసీఆర్ పాలనలోనే పాలమూరు పచ్చబడ్డది. ఏనాడూ లక్ష ఎకరాలు పారని జిల్లాలో 11 లక్షల ఎకరాలకు కృష్ణా జలాలను ఇచ్చింది నిజం కాదా? సమైక్య రాష్ట్రంలో కన్నా గత పదేండ్ల కేసీఆర్ పాలనలోనే సాగునీటి రంగంలో తెలంగాణ ఎక్కువగా నష్టపోయిందని అనడానికి నోరెలా వచ్చింది మంత్రి గారు.**

అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి వాస్తవాన్ని వక్రీకరించిన మరొక అర్ధ సత్యం వైఎస్ జగన్ వీడియో క్లిప్. ఈ క్లిప్‌ను అసందర్భంగా ముక్కలు చేసి చూపించిన విషయం చూసినవారికి అర్థమవుతూనే ఉన్నది. వేరుపడిన అవశేష ఆంధ్రప్రదేశ్ సాగునీటి కష్టాలు తీరాలంటే కృష్ణాజలాలను మళ్లించుకుపోవడం వల్ల సాధ్యపడదని 'తెలంగాణ భూభాగం గుండా గోదావరి జలాలను శ్రీశైలానికి తరలించాలి' అని కేసీఆర్ నాలుగేండ్ల కిందట ఏపీ సీఎం జగన్‌కు అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం చేశారు. 2019 జూన్- నవంబర్ మధ్యకాలంలో మూడుసార్లు ప్రగతి భవన్‌లో వారిద్దరి మధ్య ఇరుప్రాంతాల ఇంజినీర్ల సమక్షంలో సమావేశాలు జరిగి ఐదు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వీటిని ప్రస్తావిస్తూ జగన్ ఏపీ శాసనసభలో 'తెలంగాణ భూభాగం గుండా నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడానికి సిద్ధపడ్డారు' అని ఆ వీడియో క్లిప్‌లో ప్రస్తావించారు. ఇది నిజమని నమ్మడానికి ఆధారం రాయలసీమ ఎత్తిపోతల పథకం మళ్లించే నీళ్లు తెలంగాణ భూభాగం గుండా కాదు, ఆ నీళ్లు రాయలసీమలోని కర్నూలు జిల్లా భూముల నుంచే పోతాయనేది.

**రాయలసీమ ఎత్తిపోతల పథకం టెండర్లను ఆపకుండా ఉండడానికే కేసీఆర్ అపెక్స్ కమిటీ మీటింగ్‌కు పోలేదనేది మరో అబద్ధం. ఒకవేళ ఈ పథకానికి కేసీఆర్ మద్దతివ్వాలనుకుంటే జూలై 31న (అపెక్స్ కమిటీ మీటింగ్‌కు వారం ముందే) కేఆర్ఎంబీ ద్వారా రాయలసీమ ఎత్తిపోతల పనులు వెంటనే ఆపాలని ఆదేశాలు జారీ అయ్యేవేకావు. ఈ ప్రాజెక్టును ఆపాలని, స్టే ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఆగస్టు 5న పిటిషన్‌ను వేసేదేకాదు.**

శ్రీనివాస్ అనే వ్యక్తి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్‌ను దాఖలు చేసినా ఆ కేసులో బలమైన వాదనలు వినిపించింది తెలంగాణ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ రామచంద్రరావు కాదా? ఇప్పటిదాకా అడుగడుగునా కేఆర్ఎంబీ, ఎన్జీటీ, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు వద్ద రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపాలని ఒత్తిడి తెచ్చింది బీఆర్‌ఎస్ కాదా?

రోజుకు ఎనిమిది టీఎంసీల నీళ్లను ఆంధ్రకు తరలిస్తుంటే కేసీఆర్ ఆపలేకపోయారనేది మరో అబద్ధం. ఇప్పటివరకు ఆ పథకం ప్రారంభ దశలోనే ఉంటే ఎక్కడి నుంచి.. ఎలా.. రోజుకు ఎనిమిది టీఎంసీలు తరలించుకుపోయారో ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పాలి? రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆపకపోతే దానికి ఎగువన కృష్ణా నదిపై ఆనకట్ట కట్టి చుక్కనీటిని కూడా పోనివ్వనని జగన్‌కు కేసీఆర్ అల్టిమేటం జారీ చేసిన సంగతి తెలిసి కూడా కేసీఆర్‌పై అభాండాలు వేయడం విజ్ఞత అనిపించుకోదు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మరో ఆరోపణ ఏమిటంటే.. 68 శాతం కృష్ణా పరీవాహక ప్రాంతం ఉన్న తెలంగాణ రాష్ట్రానికి 299 టీఎంసీలకు అంగీకరించడం లేదా 50:50 నిష్పత్తిని అడగటం ఆంధ్రకు కృష్ణా నీళ్లను దోచిపెట్టడానికేనని. జల విధానాలు, ట్రిబ్యునల్ తీర్పులు అవగాహన చేసుకుంటే ఇలాంటి వ్యాఖ్యలు మంత్రి చేసి ఉండేవారు కాదేమో!

కృష్ణా జల వివాదాల పరిష్కారం కోసం 2004లో ఏర్పడిన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీ చేసేదాకా.. గతంలో బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టులవారీగా లేదా సమైక్యరాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి విభజనకు ముందు పంపిణీ చేసిన విధానమే కొనసాగుతుంది. కేసీఆర్ ప్రభుత్వమైనా రేవంత్ రెడ్డి సర్కార్ అయినా 299:512 టీఎంసీల నిష్పత్తిని అంగీకరించాల్సి ఉంటుంది. 2015లో ఒక్క సంవత్సరం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ఒప్పందంపై సంతకం చేసినా, అదే విధానాన్ని కొనసాగిస్తుండటంతో తెలంగాణ నీటిపారుదల ముఖ్యకార్యదర్శి ఏటా అడ్డుకుని, అరిచినా, నిరసన తెలిపి వాకౌట్ చేసినా కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేలేదాకా అంగీకరించక తప్పదు. ఏ కోర్టుకు పోయినా మన కోర్కెలు మన్నించరు. అసెంబ్లీలో ఈ విషయమై బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తప్పుపడుతున్న ఉత్తమ్-రేవంత్‌లు కూడా రాబోయే కాలంలో 299:512 టీఎంసీలకు ఒప్పుకోక తప్పదు.

**బచావత్ ట్రిబ్యునల్ తీర్పును పునఃసమీక్షించే దాకా మార్చే అవకాశం లేదు. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌కే ఏపీ విభజన చట్టంలో నీళ్లను పంచే అవకాశం ఉండింది. దాన్ని అప్పటి కాంగ్రెస్ ఉపయోగించుకోలేదు. బచావత్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ గొంతును వినిపించకుండా కృష్ణా నదిలో అందుబాటులో ఉన్న పరిమిత జలాలను కోస్తాంధ్ర - రాయలసీమకు తరలించుకుపోయింది, తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పాలకులే.**

వరద జలాలు వినియోగించుకునే అవకాశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ఇవ్వడాన్ని సాకుగా తీసుకొని మద్రాసుకు మంచినీరందించే పేరుతో బచావత్ తీర్పును కాలరాస్తూ.. శ్రీశైలం ప్రాజెక్టును సాగు నీటి ప్రాజెక్టుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. శ్రీశైలం ప్రాజెక్టును సాగునీటి ప్రాజెక్టుగా అడ్డదారిలో మార్చినందుకు నీలం సంజీవరెడ్డి పేరు ఆ ప్రాజెక్టుకు పెట్టారు. అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేఆర్ఎంబీకి శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను అప్పగించింది బీఆర్‌ఎస్ పాలకులేనని నమ్మించడానికి విఫలయత్నం చేశారు. ఈ అబద్ధాన్ని ప్రతిపక్ష నాయకుడు హరీశ్‌రావు బట్టబయలు చేశారు. కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీలను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ -2 ప్రభుత్వం ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం ద్వారానే. చట్టబద్ధంగా ఏర్పాటైన కేఆర్ఎంబీని గుర్తించలేమనో, ప్రాజెక్టులను అప్పగించలేమనో చెప్పడం అవివేకమవుతుంది. ప్రాజెక్టులను అప్పగించడంలో ఉన్న సమస్యలను కేఆర్ఎంబీ లేదా అపెక్స్ కమిటీ ద్వారా కేంద్ర జల శక్తి మంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి అర్థమయ్యేలా చెప్పడానికే అవసరమైన ప్రొటోకాల్స్, కృష్ణా జలాల్లో వాటా తదితర అంశాలను షరతులుగా పేర్కొంటూ గత తొమ్మిదేండ్లు ప్రాజెక్టులను తన చేతుల్లోనే ఉంచుకున్నది తెలంగాణ ప్రభుత్వం. ఇక ముందు ఇదే పద్ధతి కొనసాగాలి. ఫిబ్రవరి ఒకటో తేదీన జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో తెలంగాణలోని 9 ఔట్ లెట్లను కేంద్రానికి అప్పగించడం పెద్ద తప్పు.

**హరీశ్‌రావు విమర్శతో జరిగిన తప్పును తెలుసుకొని ప్రాజెక్టులను అప్పగించేది లేదని తీర్మానం చేసి ఈ ప్రభుత్వం తన తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేసింది. ఇది మాత్రమే చాలదు. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తెచ్చి కృష్ణా జలాల పునఃపంపిణీ సమస్యను సత్వరమే పరిష్కరించేలా ట్రిబ్యునల్‌పై ఒత్తిడి పెంచాలి. వెంటనే అపెక్స్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ ప్రభుత్వ విధానాన్ని స్పష్టం చేయాలి.**

ప్రధాన ప్రతిపక్ష నాయకుని పట్ల ముఖ్యమంత్రి అనుసరిస్తున్న వైఖరి, ఉపయోగిస్తున్న భాష, వ్యవహార శైలి తెలంగాణ ప్రజలు అసహ్యించుకునే స్థాయికి దిగజారింది. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో దేశానికే తలమానికంగా నిలిచిన తెలంగాణ అనతికాలంలోనే తలెత్తుకోలేని విధంగా మారడం విషాదకరం!

*వ్యాసకర్త: మాజీ చైర్మన్,*
*తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ*

# తెలుగు భాషాభివృద్ధికి ఓయూ దోహదం



**డాక్టర్ ఎస్.విజయ భాస్కర్**
92908 26988

**తెలుగు మన మాతృ భాష. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరుగుతున్నది. కొన్ని కేంద్ర విద్యాలయాలు, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు తెలుగు చదవకుండానే పదో తరగతి పూర్తి చేసుకుంటున్నారు. పదో తరగతి వరకు తెలుగు తప్పనిసరి చేస్తూ ఇరు రాష్ట్రాలు ఉత్తర్వులు జారీ చేశాయి. కానీ, అది అమలుకు నోచుకోవడం లేదు. మృత భాషల జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల మాతృభాష చేరబోతున్నట్టు ఐరాస హెచ్చరించిందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.**

పొరుగు రాష్ట్రాలు, ఇతర దేశాల ప్రజలకు తమ మాతృభాషపై ఎక్కువ అభిమానం ఉంటుంది. వారు ప్రతి ఒక్కరితో మాతృభాషలోనే మాట్లాడతారు. కానీ, మన దగ్గర అందుకు భిన్నమైన పరిస్థితి ఉన్నది. 'ఇద్దరు తెలుగువారు కలిస్తే తెలుగు తప్ప అన్ని భాషలు మాట్లాడుతారు' అనే అపవాదు ఉన్నది. రష్యా, చైనా, జపాన్ తదితర దేశాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలలో మాతృభాషను నేర్చుకున్నవారికే ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం ఉంటుంది. తెలుగు భాష కళ తప్పుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు భాషాభివృద్ధికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నడుం బిగించింది. ఏండ్లుగా ఆ దిశగా ఓయూ కృషి చేస్తున్నది. అందులో భాగంగానే తెలుగు సాహిత్య మహాసభ- 2024 పేరిట ఈ నెల 15, 16, 17 తేదీల్లో మూడు రోజుల పాటు సదస్సులు నిర్వహిస్తున్నది. దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు శాఖాధ్యక్షులు, ఆచార్యులు, ఉపన్యాసకులు, కళాశాలల్లోని బోధనా ఉపన్యాసకులు, పాఠశాలల్లోని తెలుగు పండితులు, తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్న కవులు, కళాకారులు ఇందులో పాల్గొంటున్నారు. చర్చలు, సమావేశాలు, పత్ర సమర్పణలు, కవి సమ్మేళనాలు నిర్వహించి తెలుగు భాషకు, తెలుగు పరిశోధనకు ఒక చక్కని దశను నిర్మించనున్నారు. ఘన చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ప్రారంభమై వందేండ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు సాహిత్య మహాసభలకు ఎంతో ప్రాధాన్యమున్నది. పరిశోధన రంగంలో ఓయూ తెలుగు శాఖ అద్భుతంగా రాణిస్తున్నది. ఓయూ ఆచార్యులు పరిశోధన రంగంలో ప్రతిభను చూపుతూ దేశ, విదేశాల్లో పేరు, ప్రఖ్యాతులు సంపాదిస్తున్నారు.

**తెలుగు భాషాభివృద్ధి కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, వ్యవస్థలు, సంస్థలు, సంఘాలు, విశ్వవిద్యాలయాలను ఒకే వేదిక మీదకు తీసుకురావడమే తెలుగు సాహిత్య మహాసభల ప్రధాన ఉద్దేశం. తద్వారా తెలుగు పరిశోధనకు ఒక దశను నిర్దేశించాలన్నదే మహాసభ లక్ష్యం.**

మనదేశంలోని 25 విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 150 మంది తెలుగు శాఖ అధ్యక్షులు, ప్రొఫెసర్లు తెలుగు సాహిత్యంలోని కవిత, కథ, గేయం, పాట, పరిశోధన, విమర్శ, నవల, జానపద సాహిత్యం మొదలైన అనేక అంశాలపై పత్ర సమర్పణ చేస్తారు. ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగే ఈ మహాసభకు తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ సి.కాశీం కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రొఫెసర్లు



ఎస్.గోపి, ఆర్.లింబాద్రి, డి.రవీందర్, తంగెడ కిషన్‌రావు తదితరులు పాల్గొంటున్నారు.

తెలుగు భాషలో చదివితే ఉద్యోగాలు రావనే భ్రమ ప్రజల్లో ఉన్నది. ఆ భ్రమ నుంచి ప్రజలు బయటికి రావాల్సిన అవసరం ఉన్నది. ఆంగ్ల భాషపై అభిమానం ఉంటే తప్పు లేదు. కానీ, మాతృభాషపై మమకారం పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తెలుగు భాషపై పట్టున్నవారు మీడియాలో రాణిస్తున్నారు. ఆకర్షణీయమైన వేతనాలు పొందుతున్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి పోటీ పరీక్షల్లో గ్రేస్ మార్కులు కలపాలి. పేదలు లక్షలు పెట్టి ఆంగ్ల మాధ్యమంలో చదవలేరు, కాబట్టి వారికి జీవనోపాధి కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని కోరుతూ 'జీవనోపాధి భాష- తెలుగు' అనే అంశంపై విజ్ఞాపన పత్రాలను ప్రభుత్వానికి సమర్పించాలి.

అదే సమయంలో తెలుగు భాషాభివృద్ధికి ప్రత్యక్షంగా కృషి చేస్తున్న భాషోపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పని చేస్తున్న భాషోపాధ్యాయులకు పదోన్నతులు లభించడం లేదు. తెలుగు భాషోపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరి భాషోపాధ్యాయులుగానే చాలామంది పదవీ విరమణ చేయాల్సి వస్తున్నది. ఇతర ఏ శాఖలోనూ ఈ పరిస్థితి లేదు. నూతనంగా కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు విద్యా శాఖను ఏ మంత్రికీ కేటాయించలేదు. ఉపాధ్యాయ సంఘాలు, ప్రతినిధులు, ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులతో త్వరలో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో ఆయనతో సమావేశం కోసం ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. మార్చి నుంచి పదవీ విరమణలు ప్రారంభమవుతాయి. కాబట్టి సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం కలగకుండా వీలైనంత త్వరగా పదోన్నతులు కల్పించాలి. ఈ మేరకు ఓయూ తెలుగు సాహిత్య మహాసభ కూడా తీర్మానం చేయాలి. తెలుగు భాష కోసం నిరంతరం కృషి చేస్తున్న భాషోపాధ్యాయులకు తెలుగు సాహిత్య మహాసభ కూడా తోడ్పాటు అందిస్తుందనే ఆశిస్తున్నాం.